క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న కేశవయ్య, ధనలక్ష్మి దంపతులు

తుగ్గలి : మండలంలోని కడమకుంట్లలో నూతనంగా నిర్మిస్తున్న త్రిమూర్తుల దేవాలయ నిర్మాణానికి పీ.కొత్తూరుకు చెందిన ఎర్రగుడి కుర్వ కేశవయ్య, ధనలక్ష్మి దంపతులు రూ.50వేల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు బుధవారం చెక్కు అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు లింగన్న తెలిపారు.

ముగిసిన ఉరుసు

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో బడేసాహెబ్, అట్టికల్లులో దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలు బుధవారం జియారత్‌తో ముగిశాయి. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తుల పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

వెల్దుర్తి: వచ్చే విద్యా సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక డాక్టర్ గురుకులం ప్రిన్స్‌పాల్ లక్ష్మి ప్రసూన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 4వ తరగతి పూర్తి చేసుకుంటున్న వారు, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 10వ తరగతి పూర్తి చేసుకుంటున్న వారు అర్హులన్నారు. మార్చి 6వ తేదీ లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

మద్దికెర : మండల కేంద్రం శివారులో నాటుసారా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారుచేసినా, విక్రయించినా అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్‌ఐ ప్రవీణ్ ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

తుగ్గలి : ప్రజల సహకారంతో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ విశ్వమోహన్, ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్పయాదవ్ అన్నా రు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు చెత్త బుట్టలను అందించారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్ యా ర్డులకు తరలించేలా చూడాలన్నారు.

యూనిక్ కోడ్‌తోనే రైతులకు ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న వ్యవసాయ జేడీఏ పీఎల్ వరలక్ష్మి

పత్తికొండ రూరల్ : ప్రతి రైతుకు యూనిక్ నంబర్ ఉంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని అగ్రికల్చర్ డీఏఓ పీఎల్ వరలక్ష్మి అన్నారు. బుధవారం పత్తికొండ వ్యవసాయ సబ్‌డివిజన్ ఏడీఏ విజయమోహన్‌తో కలిసి పత్తికొండలోని 2, 3 రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల రైతులు తమ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని 11 నంబర్ల యూనిక్ కోడ్ పొందాలన్నారు. అలాగే పీఎం కిసాన్ లబ్ధిదారులకు రైతు రిజిస్ట్రేషన్‌ల నంబర్లను జారీ చేస్తామని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు, మండల ఏఈఓ రియాజ్, శ్రీనాథ్ ఉన్నారు.

వర్మీ కంపోస్టు తయారీ వేగవంతం చేయాలి

ఆలూరు రూరల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో చెత్త నుంచి సంపద తయారీ వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ ప్రభాకర్ పంచాయతీ కార్యదర్శులకు బుధవారం విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న చెత్త సంపద కేంద్రాలు ఈ నెలాఖరులోగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ట్రై సైకిళ్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో క్లాప్ మిత్రాలను నియమించుకోవాలని, వారు సేకరించిన పొడి,తడి చెత్త నుంచి వారానికి ఒకసారి సేంద్రియ ఎరువు తయారీ చేసి రైతులకు విక్రయించాలని స్పష్టం చేశారు. వర్మీకంపోస్టు విక్రయించిన నగదు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు.

సూక్ష్మ పౌష్టికాహార నిర్వహణపై శిక్షణ

వెల్దుర్తి: న్యూఢిల్లీ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అంగనవాడీ కేంద్రాలలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సూక్ష్మ పౌష్టికాహార నిర్వహణపై 60 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట సుబ్బరాజు శిక్షణ ఇచ్చారు. వెల్దుర్తి సీడీపీఓ ల్యూక్ న్నారు.





మళ్లీ చిగురిస్తా..

నిలువునా నరికినా చిగురించడమే నా నైజం..చెట్టుగా ఎదిగి నీడ నివ్వడం నా గుణం.. అంటున్నాయి ఆ చెట్లు. పెండేకల్లు రైల్వే జంక్షన్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఫ్లాట్‌ఫాంపై ఉన్న రావి చెట్టును అరు నెలల క్రితం నరికేశారు. ఇటీవల ఆ చెట్టు మోడు నుంచి చిగురులు వచ్చి ఆకులు వేసిన మోడు చూడ ముచ్చటగా ఉంది. అలాగే పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాల వెనుక వంకలో ఉన్న నీలగిరి చెట్లను కొట్టేశారు. ఆ చెట్ల మోడు నుంచి చిగుళ్లు తొడిగి ఆకులు వేస్తున్నాయి.

– తుగ్గలి

కోక..పంటకు రక్ష!



వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటను తెగుళ్లు ఆశించకుండా అన్నదాతలు రకరకాల ప్రయత్నాలు చేస్తూ కాపాడుకుంటున్నారు. మండల కేంద్రం మద్దికెర సమీపంలోని గుంతకల్లు రహదారిలో రెండు ఎకరాల్లో వేరుశనగ పంటను తెగుళ్లు ఆశించకుండా, అలాగే.. పశువులు, అడవి పందులు, జింకలు పంటలపై దాడి చేయకుండా చుట్టూ చీరలు కట్టి కాపాడుకుంటున్నట్లు రైతు బాషా తెలిపాడు. కాగా.. గతంలో వివిధ రకాల పంటలకు కంచె పంటలుగా కొన్ని రకాల పంటలు సాగు చేసేవారు. వాటి ద్వారా తెగుళ్లు ఆశించేవి కాదు. ముఖ్యంగా కుసుమ పంట వేసేవారు. కంచె పంట వేయని వారు ఇలా పాత చీరలను తెచ్చి కర్రలు పాతి కంచె ఏర్పాటు చేస్తున్నారు.

– మద్దికెర

రమణీయం.. బసవేశ్వరుడి రథోత్సవం





బాపురంలో రథం ముందు కళాకారుల విన్యాసాలు , రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామంలో బసవేశ్వరస్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం రమణీయంగా సాగింది. ఉదయం 3 గంటలకు మహారుద్రాభిషేకం, 5 గంటలకు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు నమఃశివాయ అనే పంచాక్షరి జపిస్తుండగా.. రథాన్ని ఆలయం నుంచి ముందుకు లాగారు. పచ్చారపల్లి గ్రామం నుంచి పెద్ద హారం తీసుకొచ్చి రథానికి వేశారు. ఉత్సవాన్ని తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పాల్గొని స్వామివారికి, రథానికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడుపప రామరెడ్డి, జిల్లా కార్యదర్శి అర్ధగేరి శ్రీనివాసులు, మండల యూత్ అధ్యక్షుడు గంగాధర, నాయకులు చెన్నప్ప, పాల్‌రెడ్డి, వీరభద్రగౌడ్, గుండయ్యస్వామి, ఎంపీటీసీ గోపాల్, తిమ్మన్నగౌడ్, శివగౌడ్, రవిగౌడ్, నాగన్న, సోమన్న, రవి, గోవర్ధన, కృష్ణ, గోపాల్, రామయ్య పాల్గొన్నారు.

కొనసాగిన ప్రతిష్ఠోత్సవాలు

ఆలూరు: స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ప్రారంభమైన అశ్వర్థనారాయణ,నాగదేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు బుధవారం కొనసాగాయి. ఉదయం నాగదేవతలకు క్షీరాభిషేకం, అభిషేకం, రుద్రహోమం, దుర్గా హోమం, శయ్యాది వాసం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను పండితులు గరుడాద్రి రామసుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో జరిపించారు. గురువారం అశ్వర్థనారాయణ స్వామి కల్యాణోత్సవం, దేవతామూర్తుల ప్రతిష్ఠాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కౌలు రైతు సంక్షేమ చట్టం తీసుకురావాలి



డీఏఓ వరలక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆస్పరి: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు విరుపాక్షి, అంజినయ్య, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, రంగస్వామి, మల్లన్న డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రామేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కౌలు రైతుల రక్షణ కోసం ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని తీసుకురావాలన్నారు. భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బ్యాంకుల్లో రూ.2లక్షలు వరకు పంట రుణాలు ఇవ్వాలని, బీమా పథకాన్ని వర్తింప చేయాలని కోరారు.

ఆలూరు రూరల్: వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పుల నేపథ్యంలో కౌలు రైతుల కోసం నూతన సంక్షేమ చట్టం తీసుకురావాలని బీకేఎంయూ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ అన్నారు. ఏడీఏ కార్యాలయంలో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. భూ యజమానుల ప్రమేయం లేకుండా రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ అదేశానుసారం కౌలు రైతులకు రూ.2 లక్షల హామీ లేని రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలన్నారు. పంట నష్ట పరిహారం, పంట సబ్సిడీ వంటి తదితర పథకాల నగదు కౌలు రైతులకే చెందేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి గోపాల్, వెంకటేశులు ఉన్నారు.

పత్తికొండ రూరల్ : కైలు రైతుల బాగు కోసం సంక్షేమ చట్టాన్ని తీసుకు రావాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు కారన్న మండల కార్యదర్శి సిద్దు, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు రమేష్‌ను కలిసి కౌలురైతుల సమస్యలపై వినతి పత్రం అందజేసి మాట్లాడారు. నాయకులు నాగిరెడ్డి, ఉచ్చీరప్ప, రాజప్ప పాల్గొన్నారు.

మద్దికెర : గ్రామ సభలు నిర్వహించి భూయజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు డిమాండు చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్‌కు అందజేశారు.

వెల్దుర్తి: కౌలు రైతులకు సమగ్ర చట్టం తేవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ, అనుబంధ సంఘాల ప్రతినిధులు వినతి పత్రాన్ని బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు అందించారు. రాష్ట్రంలో 70శాతం కౌలు రైతులేనని, వారికి ప్రభుత్వ రైతు పథకాలు, బ్యాంకు రుణాలు, గుర్తింపు కార్డులు అందేలా చూడాలని అందులో పేర్కొన్నారు. సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ, వ్యవసాయ, కార్మిక, రైతు సంఘం ప్రతినిధులు చిలిపి కృష్ణ, వెంకటేశ్వర్లు, రాజు, రాముడు, చిన్నమాదులు ఉన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత గోనెగండ్ల జట్టు



విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న గోనెగండ్ల జట్టు

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామంలో లాలుస్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర హోంటీం కబడ్డీ టోర్నీలో గోనెగంట్ల జట్టు విజేతగా నిలిచింది. రెండ్రోజుల పాటు జరిగిన టోర్నీ బుధవారం నాటి ఫైనల్ పోటీలో తాడిపత్రి జట్టుతో తలబడిన గోనెగండ్ల జట్టు మెరుగైన ఆటతీరుతో ప్రథమ బహుమతి రూ.20వేలు గెలుచుకుంది. తర్వాతి 5 స్థానాల్లో వరుసగా తాడిపత్రి, డోన్ మండలం వి.బొంతిరాళ్ల, కోడుమూరు మండలం వల్కూరు, దేవనకొండ మండలం గుడిమర్ల, గుండ్లకొండ జట్లు నిలిచి రూ.15వేలు , రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు గె లుచుకున్నాయి. విజేతలకు దాతలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులందించారు.



భక్తులతో కిక్కిరిసిన లాలుతాత దర్గా

వైభవంగా లాలు స్వామి ఉరుసు

కృష్ణగిరి: చిట్యాల గ్రామంలో బుధవారం తాతయ్య లాలుస్వామి ఉరుసు వైభవంగా జరిగింది. గ్రామస్తులంతా నడిచి రాగా మంగళవారం రాత్రి గంధాన్ని అశ్వంపై పురవీధుల్లో ఊరేగిస్తూ బుధవారం తెల్లవారుజామున దర్గాలో సమర్పించారు. కులమతాలకు అతీతంగా భక్తులు తరలివచ్చి స్వామి సమాధికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉరుసు సందర్భంగా గ్రామంలోని లోగిళ్లు బంధుమిత్రులతో కళకళలాడాయి. స్వీటు, గాజుల అంగళ్లు వెలిశాయి.



దేవేరులతో కలిసి గరుడ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీరంగనాథుడు

గరుడ వాహనాధీశా.. నమామి

మద్దికెర : పెరవలి గ్రామంలో కొలువైన శ్రీరంగనాథుడికి మాఘ పూర్ణమిని పురస్కరించుకొని బుధవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడ వాహనంపై విహరించారు. అంతకుముందు అర్చకులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, బిందెసేవ, అభిషేకం అనంతరం నైవేద్యం సమర్పించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. సాయంత్రం స్వామి వారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు.ఈఓ వీరయ్య, సిబ్బంది రఘు, భక్తులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారూ!

- వీఓఏ ఆవేదన
- రసాభాసగా మారిన గ్రామైక్య సంఘం సమావేశం



కోర్టు ఆర్డర్ చూపుతున్న రాజేశ్వరమ్మ

వెల్దుర్తి: రాజకీయ ఒత్తిళ్లతో తనను వీఓఏగా తొలగించారని, కోర్టును ఆశ్రయించగా తనకు అనుకూలంగా తీర్పు వచ్చి సంబంధిత అధికారులకు చూపినా పట్టించుకోకుండా స్థానికేతరులను వీఓఏగా కొనసాగిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని చెర్లకొత్తూరు వీఓఏ ఈ. రాజేశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం చెర్లకొత్తూరు గ్రామంలో డీఆర్‌డీఏ వెలుగు సీసీ శివన్న ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుతం విధులు నిర్వహించాల్సిన మహిళా వీఓఏ స్థానంలో మరో వ్యక్తి పనిచేస్తున్నట్లు గుర్తించారు. స్థానికేతరురాలైన వీఓఏ స్థానంలో మరో వ్యక్తి పనిచేయడమేమిటని ప్రశ్నించడంతో వాగ్వావాదం చోటు చేసుకొని రసాభాసగా మారి సమావేశం మధ్యలోనే ముగిసింది. రాజేశ్వరమ్మ మాట్లాడుతూ తనను రాజకీయ ఒత్తిళ్లతో నాలుగు నెలల క్రితం తొలగించిన సంబంధిత అధికారులు వీఓఏగా స్థానికేతరురాలిని నియమించారని, ఇదే విషయమై తాను కోర్టును ఆశ్రయించగా తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఈ ఆర్డరు కాపీతో పాటు తనకు అనుకూలంగా గ్రామైక్య సంఘం తీర్మాణం కాపీ తీసుకెళ్లి మండల అధికారికి అందజేసినా పట్టించుకోవడం లేదని వాపోయింది. జిల్లా పీడీ, కలెక్టర్‌కు సైతం విన్నవించానని, విచారించి న్యాయం చేయాల్సిందిగా వారు ఆదేశాలిచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

ఇరువర్గాలపై కేసు నమోదు

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో బుధవారం పాతకక్షలతో గొడవకు దిగిన రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలనరసింహులు తెలిపారు. గ్రామంలోని ఓ వర్గానికి చెందిన బసప్ప, మరో నలుగురు ట్రాక్టర్ వేగంగా నడిపిన విషయంలో మరో వర్గానికి చెందిన దగ్గప్ప మరో నలుగురు గొడవకు దిగి దాడి చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సేవలపై ప్రజలకు అవగాహన కల్పించండి



ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో చర్చిస్తున్న అధికారులు

వెల్దుర్తి: స్థానిక సీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు, చేయాల్సిన అభివృద్ధిపై బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశమై సమీక్షించారు. కమిటీ కన్వీనర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు ఎంపీడీఓ సుహాసిని, పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్, తిరుమలేశ్ గౌడ్ పాల్గొన్నారు. ఆసుపత్రి సేవలు మెరుగుపరిచేలా, పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నిష్ణాతులైన వైద్యులుండి, తగు సిబ్బందితో కార్పొరేట్ స్థాయిలో సేవలు కలిగిన ప్రస్తుత వైద్యశాలలో వైద్యులు సమయపాలన పాటిస్తూ, ప్రజలకు సేవలందించాలని ఎంపీడీఓ సూచించారు. సమావేశంలో వైద్యులు రంగస్వామి, సాహిత్య, రాజశేఖర్, ఈఓఆర్డీ రవికిశోర్ పాల్గొన్నారు.

తప్పిన ముప్పు



పత్తికొండలో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పత్తికొండ రూరల్ : నంద్యాల నుంచి పత్తికొండకు పశుగ్రాసం తెస్తున్న రామ్మూర్తిగౌడ్ ఐచర్ వాహనానికి మండలంలోని చక్రాళ్ల రోడ్డులో బుధవారం విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని పశుగ్రాసం కాలిపోయింది. మంటలు చెలరేగడంతో వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న ఫైర్ ఎస్‌ఐ దినకర్‌బాబు, లీడింగ్ ఫైర్‌మెన్ వెంకటేశ్వర్లు, సిబ్బంది మున్న, షబ్బీర్‌హుసేన్, డ్రైవర్ అంజి ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలు అదుపు చేశారు. సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లింది. మంటలకు ఐచర్ వాహనం కొద్దిగా దెబ్బతింది. ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పింది. అలాగే మండలంలోని జూటూరు గ్రామంలో రాజప్ప అనే రైతుకు చెందిన గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. గ్రామస్తులతో సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.80వేలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

కనుల పండువగా కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

మద్దికెర : మద్దమాంబ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూలమూర్తి, ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. రాత్రి లగ్నోత్సవం చేపట్టిన అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని తేరుబజారులో ఊరేగించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

స్వచ్ఛ దివస్ నిర్వహించాలి

ఆలూరు రూరల్: ప్రతి నెల మూడవ శనివారం గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం చిప్పగిరి మండలంలోని నగరడోణ,నేమకల్లు, బెల్డోణ గ్రామాల చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. నేమకల్లు పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.



నగరడోణ చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రప్ప

కౌలుట్ల చెన్నకేశవస్వామి రథోత్సవం



భక్తుల మధ్య ముందుకు కదులుతున్న రథం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల ఫారెస్ట్‌లో వెలిసిన శ్రీ కౌలుట్ల చెన్నకేశవస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామం, స్వామివారికి విశేష అలంకరణ, గజవాహనంపై స్వామి వారిని ఊరేగించారు. సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య. రథ చక్రాలు ముందుకు కదిలాయి.

ఘనంగా పౌర్ణమి పూజలు



శివపార్వతుల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

ఆలూరు రూరల్: పట్టణంలోని కోట వీధిలో వెలసిన భీమలింగేశ్వర ఆలయంలో మాఘ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు, మల్లికార్జున స్వామి, శివరుద్రయ్య స్వామి ఆధ్వర్యంలో భీమలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల విగ్రహాలను ఊరేగించారు.

మద్దికెర : పౌర్ణమి సందర్భంగా దేవసేన, శ్రీవల్లి సమేతుడైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు హోమాలు జరిపించారు.

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెల్దుర్తి ఆర్‌ఐగా మంజుల

వెల్దుర్తి: కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.మంజుల పదోన్నతి పొంది వెల్దుర్తి మండలం ఆర్‌ఐగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కర్నూలు డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ ఆదేశాలు వెలువరించారు. కాగా ఇన్‌చార్జ్‌గా మల్లెపల్లె వీఆర్‌ఓ ప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే బుక్కాపురం వీఆర్‌ఓ తిమ్మయ్య హెచ్‌ఎస్ఎస్ఎస్ యూనిట్-4 ఎస్‌డీసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు.